క్లుప్తంగా

నీటి ట్యాంకును తొలగించాలి



కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్వో కాలనీలో నిరుపయోగంగా ఉన్న నీళ్ల ట్యాంకును తొలగించాలని కాలనీవాసులు శనివారం ఎంపీడీఓ కృష్ణారావ్‌కు, ఎంపీఓ రామన్నకు వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్ల క్రితం మంచినీళ్ల ట్యాంకును ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు వస్తుండడంతో ట్యాంకు నిరుపయోగంగా మారిందన్నారు. అదే విధంగా ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా మారిందని వెంటనే ట్యాంకును తొలగించి ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కిరణ్ గౌడ్, అశోక్, బాలు యాదవ్, తిమ్మారెడ్డి, నరేశ్, మదుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో అర్చకుడిని నియమించాలి

మరికల్: మండల కేంద్రంలోని హనుమాన్ వాడ అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిని నియమించాలని గ్రామస్తులు శనివారం జిల్లా దేవాదాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఆలయంలో అర్చకుడిగా ఉన్న వేణుగోపాల్ శర్మ అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. ఆయన మృతి చెంది పది నెలలు గడుస్తుందని, అప్పటి నుంచి ఆలయంలో అర్చకుడు లేక పూజలు సక్రమంగా జరగడం లేదన్నారు. దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి మరికల్‌కు చెందిన నాగరాజ్‌శర్మను అర్చకుడిగా నియమించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: భైరంకొండ గ్రామానికి చెందిన కార్తీక్ అనే యువకుడు తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు పెన్నులు పంపిణీ చేశాడు. పుట్టినరోజు పేరుతో వృథా ఖర్చులు చేయకుండా తన వంతుగా విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని కాంగ్రెస్ నాయకుడికి గాయాలు

మరికల్: బీసీ బంద్ కార్యక్రమంలో భాగంగా దుకాణాలను మూయించి జాతీయ రహదారిపై బైక్‌పై వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కాంగ్రెస్ నాయకుడికి తీవ్ర గాయలయ్యాయి. మరికల్‌లో బంద్ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు సూర్యప్రకాష్ దుకాణాలను మూయించి బైక్‌పై వస్తుండగా పస్పుల నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయనకు కాలు విరగగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి



కొత్తపల్లి: రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారిణి విశాల, సవిత తెలిపారు. మండల పరిధిలోని పెదిరిపాడ్, రెనివట్ల, పల్లెర్ల, చెన్వార్, కొత్తపల్లి మండలంలోని ఎక్కామేడ్, గోకుల్‌నగర్ గ్రామాల్లో పర్యటించి రైతులు పెంచుకునే పశువులకు శనివారం ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 200కు పైగా పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. డాక్టర్ విశాల,సవిత,దేవేందర్ (విఏ) యుద్ధం నాయక్ పలు గ్రామాల క్లస్టర్‌ల గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలోని పెద్ద వాగులో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం రావడంతో వాగులో వెళ్లి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి లేకపోవడంతో నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు.



కోస్గిలో మాట్లాడుతున్న మున్సిపల్ అధ్యక్షుడు రాములు



మక్తల్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు



నారాయణపేటలో..

బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం

సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన శనివారం చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతమైంది. అఖిల పక్షం పార్టీలతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొని విద్యాసంస్థలను, దుకాణాలను మూసివేయించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆపమన్నారు.



మరికల్‌లో జాతీయ రహదారిపై రాస్తా రోకో చేస్తున్న నాయకులు

❒ నారాయణపేట మండలంలోని కోటకొండ, జాజాపూర్, కొల్లంపల్లి తదితర గ్రామాల్లో విద్యాసంస్థలు తరగతులను బహిష్కరించాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి.

❒ కోస్గి పట్టణంలోని రామాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు.

❒ మక్తల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో అఖిలపక్షం నాయకులు బంద్‌కు సహకరించారు. 42శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ చేర్చి బీసీలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

❒ ఊట్కూరులోని బిజ్వార్, చిన్నపొర్ల, పెద్దపొర్ల తదితర గ్రామాలలో ప్రజాసంఘాల నాయకులు దుకాణాలు మూయించారు. పాఠశాలలను బంద్ చేయించారు. అలాగే పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

❒ నర్వలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలు, హోటల్స్, పెట్రోల్‌బంక్‌లను మూసివేయించారు. అనంతరం ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ కూడలిలో ధర్నా నిర్వహించారు.

❒ కృష్ణా మండంలోని టైరోడ్డులో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకుడు అమర్‌కుమార్ దీక్షిత్,కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్పగౌడ్,బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్‌లు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందపర్చిన 50 శాతం రిజర్వేషన్లను సవరించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

❒ మాగనూర్‌లో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై కపట ప్రేమ చూపకుండా న్యాయం చేయాలని కోరారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు.

❒ ధన్వాడలో అఖిల పక్షల పార్టీ నాయకులు రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, నరహరి, ఉదబాను, నిరజంన్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్ ఆధ్వర్యంలో బంద్‌ను విజయవంతం చేశారు.



ఊట్కూరులో మాట్లాడుతున్న నాయకులు



దామరగిద్దలో..

❒ మరికల్‌లో అఖిలపక్షం పార్టీల ఆధ్వర్యంలో దుకాణాలను మూయించి ర్యాలీ నిర్వహించారు. నేతలు సూర్యమోహన్‌రెడ్డి, తిరుపతయ్య మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటం ఆపమన్నారు.

❒ కొత్తపల్లిలో అన్ని పార్టీల నాయకులు పోటాపోటీగా ధర్నా నిర్వహించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.



నర్వలో నాయకుల ధర్నా



కృష్ణాలో..



కొత్తపల్లిలో బంద్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



మాగనూర్‌లో రాస్తా రోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు



ధన్వాడలో బంద్‌లో పాల్గొన్న నాయకులు



నారాయణపేటలో పాఠశాలను మూసివేయిస్తున్న యువకులు

కోయిలకొండ మీదుగా బస్సు నడపాలి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోటకొండ ప్రజల సౌకర్యార్థం కోయిలకొండ మీదుగా మహబూబ్ నగర్‌కు బస్సును నడపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డిపో మేనేజర్ లావణ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ రూట్‌లో గతంలో ఓ సర్వీసు నడిచేదని గుర్తు చేశారు. నైట్ అవుట్ సర్వీసుగా పునరుద్ధరిస్తే సాయంత్రం వేళల్లో జిల్లా కేంద్రం నుంచి కోటకొండ వరకు వచ్చే విద్యార్థులకు, ఉదయం గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు సైతం సౌకర్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా అమ్మిరెడ్డిపల్లి, బొమ్మన్ పాడు, అభంగాపూర్, బండగొండ, తిరుమలాపూర్, కోటకొండ, వింజమూరు గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ఈ మార్గంలో పాలమూరు వెళ్లేందుకు కిలోమీటర్లు తక్కువగా ఉండడంతో పాటు, బస్సులో రద్దీ సైతం ఉంటుందని, మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, కాశప్ప, దస్తప్ప, నరహరి, మల్లేష్, వెంకటేష్, గోవింద్, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీఎం లావణ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాంగ్రెస్ డ్రామాకు వ్యతిరేకంగా బీజేపీ నిరసన

నారాయణపేట: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న డ్రామాను నిరసిస్తూ బీజేపీ నాయకులు నారాయణపేట మండలం కోటకొండ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కెంచె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులగణన సరిగా చేయకుండా బీసీ బిల్లులో ముస్లింలకు చోటు కల్పించి తప్పుల తడకగా బిల్లును తయారు చేసి గవర్నర్‌కి పంపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై చిత్త శుద్ధి ఉంటే న్యాయపరమైన సమస్యలు లేని బిల్లును తయారు చేసి అందరి ఆమోదంతో ముందుకు వెళ్లాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు కొంగరి రాములు సాక ప్రవీణ్ వేపూరు రవి, కావలి నర్సింములు, సాయి, నారాయణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం

నర్వ: మండలంలోని నాగిరెడ్డిపల్లి-ఉంధ్యాల్ వరకు రహదారి మరమ్మతు పనులను అధికారులు శనివారం ప్రారంభించారు. రోడ్డు మరమ్మతుకు మంత్రి వాకిటి శ్రీహరి రూ.1.98 లక్షలు మంజూరు చేయడంతో రహదారి మరమ్మతు, ముళ్లపొదల తొలగింపు పనులు చేపట్టారు. కురుమూర్తి జాతర ప్రారంభం కానుండడంతో పనులు త్వరగా పూర్తి చేసేందుకు జేసీబీతో ముందుగా ముళ్లపొదలను తొలగించారు. ప్రజల అవస్థలను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేసిన మంత్రికి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్‌కు స్థానిక ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నరేష్, నాయకులు చందు, టీచర్ రాజు, రామంజనేయులు, మార్క నర్సింములు, తదితరులు పాల్గొన్నారు.



ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ

చట్టాలు అందరికీ సమానం



ఆత్మకూర్ : ఉన్నోడినైనా లేనోడినైనా చట్టాలు అందరికీ సమానమేనని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శిరీషా అన్నారు. శనివారం మండలంలోని బాలకృష్ణపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, ఉన్నత చదువులతో లాభాలు, పోక్సో చట్టం , ర్యాగింగ్ తదితర విషయాలను క్లుప్తంగా వివరించారు. కేజీబీవీ ఎస్ఓ స్వప్న, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

కొత్తకోట: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సీఐ రాంబాబు సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలో వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవడంతో పాటు, కార్ల డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. మైనర్ల చేత వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

జేపీఎన్‌సీఈలో ముగిసిన శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ధర్మాపూర్ శివారులోని జేపీఎన్‌సీఈలో సీఎస్ఈ విద్యార్థులకు 'బిగ్ డేటా అండ్ క్లౌడ్ కంప్యూటింగ్ అప్లికేషన్స్- ట్రెండ్స్'పై ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. దీనిని సాధారణ పరిస్థితుల్లో ఎలా ఉపయోగించాలో ఇన్ఫోసిస్ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కార్తీక్‌కుమార్ వివరించారు. కో- ఆర్డినేటర్ కృష్ణమూర్తి, కో కో-ఆర్డినేటర్ స్వాతి, సీఎస్ఈ విభాగాధిపతులు గురురాఘవేంద్రారెడ్డి, జమున, రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

మీపనగండ్ల: మండలంలో దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ సమత సమాజ్ వారి ఆధ్వర్యంలో తూముకుంట గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మధుకర్, నాగరాజు, కర్ణాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, రెండో బహుమతి రూ.10 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచే క్రీడాకారులు 97012 12903, 96180 60150కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

పండుగ.. కాకూడదు విషాదం

- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- వృద్ధులు, ఆస్తమా బాధితులకు అప్రమత్తత అవసరం

కోస్గి రూరల్: చీకటి పారిపోయే వేళ.. టపాసుల వెలుగుల్లో తారలు తళుక్కుమన్న వేళ.. ఆకాశాన్ని తాకే తారాజువ్వలు అందరి మదిని దోచేస్తాయి. చెడుపై విజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకొంటారు. ఇంటిల్లిపాది టపాసులు కాల్చుతూ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. అయితే టపాసులు కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు శబ్ద కాలుష్యం 30 శాతం పెరిగే అవకాశం ఉంటుంది. ఈ కాలుష్యం ముప్పుతో శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా పిల్లలు, ఆస్తమా, టీబీ తదితర వ్యాధిగ్రస్తులు బాణాసంచాతో జరభద్రంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

మూడు రోజుల వరకు ప్రభావం...

టపాసులు ఇతర బాణాసంచా కాల్చడం వల్ల వాటి ప్రభావం సుమారు మూడు రోజుల వరకు ఉంటుంది. ఈ క్రమంలో వాయు కాలుష్యం పెరిగిపోయి శ్వాసకోశ, ఇతర చర్మ వ్యాధులకు కారణమవుతాయి. టాక్సిక్ కారకాలైన రాగి, కాడ్మియం, పోటాషియం వంటి పదార్థాలు అస్తమాకు కారణమవుతాయి. అస్తమా లేని వారు కూడా వీటి ప్రభావంతో వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది.

కళ్లకు ముప్పు...

టపాసులు కాల్చేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కళ్లకు ముప్పు తప్పదని కంటి వైద్యులు చెబుతున్నారు. 70–80 శాతం ప్రమాదాల్లో 10–18 ఏళ్ల వారే ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. అదే బాణాసంచా కాల్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కళ్లతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సూచనలు పాటిస్తే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.



టపాసులు విక్రయిస్తున్న వ్యాపారులు

సూచనలు, సలహాలు...

- టపాసులు కాల్చేటప్పుడే కాటన్ దుస్తులే ధరించాలి.
- చిన్న పిల్లలు పెద్దల సమక్షంలోనే బాణాసంచా కాల్చాలి.
- సగం కాల్చిన, కాలని టపాసులను నీళ్లు, ఇసుకలో వేయడం ఉత్తమం.
- రాకెట్స్ ఇతర టపాసులను గుడిసెలు, పెట్రోల్ బంకుల వద్ద కాల్చరాదు.
- టపాసులు కాల్చుతున్నప్పుడు సమీపంలో నీళ్లు ఉంచుకోవాలి.
- రాకెట్స్, ప్రమాదకరమైన టపాసులు కాల్చేటప్పుడు ఊరి బయట కాల్చాలి.
- టపాసులను చేతుల్లో ఉంచుకోని కాల్చరాదు.
- కూర్చొని బాణాసంచా కాల్చడం ప్రమాదకరం.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- టపాసుల్లో ఉండే సల్ఫర్ , కార్బన్ కళ్లకు హానీ కలిగిస్తాయి. ఈ వాయువులు కళ్లలోకి వెళ్తే కళ్లలో మంట, దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. దుమ్ము, దూళీ వల్ల కూడా కళ్లు ఎర్రగా మారి ఇబ్బందులు తప్పవు. అటువంటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే కంటి వైద్యులను సంప్రదించాలి.
- భారీ బాణాసంచా పేల్చేటప్పుడు శబ్దాలకు పిల్లలు, గర్భిణులకు, వృద్ధులకు చెవిలో దూది పెట్టడం మేలు.
- ఇంట్లో పిల్లలకు టపాసులు దూరంగా ఉంచాలి. కొన్ని సార్లు పిల్లలు చేతులతో వాటిని ముట్టుకొని అదే చేతులతో ముఖం, కళ్లపై రుద్దడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి.
- సీవోపీడీ, ఆస్తమా, అలర్జీ ఉంటే మరింత జాగ్రత్తలు అవసరం. ముందు జాగ్రత్తగా ముక్కు దగ్గర తడి వస్త్రం కట్టుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే ఎలాంటి హాని జరగకుండా ఉంటుంది.

భారీ శబ్ధంతో ప్రమాదం



నిబంధనల ప్రకారం 120 డెసిబెల్స్ శబ్ధం కంటే ఎక్కువ శబ్ధం వచ్చే టపాసులు కాల్చడం నిషేధం. స్కూళ్లు , దేవాలయాలు, ఆసుపత్రులకు కనీసం 100 మీటర్ల దూరంలో బాణాసంచా కాల్చాలి. ఇళ్ల మధ్య కాల్చకపోవడం మంచిది. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు దీపావళి రోజు బయటికి రాకపోవడం ఉత్తమం .టపాసులు పేల్చే సమయంలో చెవిలో దూది పెట్టుకోవాలి.

–అనుదీప్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, కోస్గి

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కపాస్ కిసాన్ యాప్‌పై అన్నదాతలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ.. వానాకాలంలో పండించిన పత్తిని సీసీఐ ద్వారా మిల్లులకు తరలించి అమ్ముకునే రైతులకు మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి పంట వేసిన ప్రతి రైతు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. పత్తి రైతులు తప్పనిసరిగా ఆధార్ లింకు ఉన్న మొబైల్ నెంబర్ గ్రామ పరిధిలోని ఏఈఓ దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులకు కనీస మద్దతు ధర తప్పకుండా లభిస్తుందన్నారు. అనంతరం రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి దినకర్, ఏఈఓ అంజమ్మ, స్థానిక నాయకులు మహమ్మద్ గౌస్, తాజుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి మహర్షి జయంతి



ఊట్కూరు: ఊట్కూరు నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధన్వంతరి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమం జరిపించారు. మానవాళికి ఆయుర్వేద వైద్యాన్ని అందించిన మహర్షి అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాధకృష్ణ, వెంకటేష్, రమేష్, రవి, రాజు, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



ఆత్మకూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.10వేల చొప్పున మంజూరు చేసిన నిధుల నుంచి ఆత్మకూర్ జూనియర్ కళాశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ప్రిన్సిపాల్ సైదులు క్రికెట్ బ్యాట్‌లు, వాలీబాల్స్, క్యారం బోర్డ్స్, చెస్‌బోర్డ్స్, షటిల్ బ్యాట్స్ తదితర క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి పీడీ రాఘవేందర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, విశ్వేశ్వర్, సునీల్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నారాయణపేట జి. వెంకటేష్ గౌడ్ - 96666 52077
మక్తల్ మల్లేష్ - 83099 46853
కోస్గి కె. రమేష్ - 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

సయ్యద్ జావిద్ అలి : 90109 62007